# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ గత 11 సంవత్సరాల్లో 34 వేల కిలోమీటర్ల నూతన రైల్వే ట్రాక్స్ నిర్మించడం ద్వారా భారతీయ రైల్వేలు కొత్త రూపును సంతరించుకున్నాయని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

❖ ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద ప్రారంభించిన బ్యాంకు ఖాతాల సంఖ్య 55 కోట్లు దాటిందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

❖ భారతదేశానికి పోరాడే శక్తి ఉందని, ఇతర దేశాల ఒత్తిడికి తలొగ్గదని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

❖ ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో ఈ రోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ లో కడపటి వార్తలు అందే సరికి ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 67 పరుగులు చేయాల్సి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 11 సంవత్సరాల్లో 34 వేల కిలోమీటర్ల నూతన రైల్వే ట్రాక్‌లు నిర్మించడం ద్వారా భారత రైల్వేలు కొత్త రూపును సంతరించుకున్నాయని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈరోజు భావ్‌నగర్ రైల్వే స్టేషన్ నుండి భావ్‌నగర్-అయోధ్య కంటోన్మెంట్ వీక్లీ రైలును మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. రేవా నుండి పూణే, జబల్‌పూర్ - రాయ్‌పూర్ మధ్య మరో రెండు రైళ్లను కూడా మంత్రి దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ... రైల్వే నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం, ఆధునీకరించడం, విస్తరించడం, రైళ్లలో భద్రత, పరిశుభ్రత ప్రమాణాలను పాటించడంలో నిబద్ధత చాటుకుంటున్నామని చెప్పారు. దేశంలో చేపడుతున్న 1,300 స్టేషన్ల పునరాభివృద్ధి ప్రపంచంలోనే అతిపెద్ద స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టుగా నిలువనుందని అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద ప్రారంభించిన బ్యాంకు ఖాతాల సంఖ్య 55 కోట్లు దాటిందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. బ్యాంకు ఖాతాలకు KYC తప్పనిసరి కావడంతో, ఈ ప్రక్రియను సరళీకృతం చేయాలని, సమాచారాన్ని ముందుగానే ప్రజలకు చేరవేయాలని బ్యాంకులను కోరామని ఆమె పేర్కొన్నారు. దాంతో జులై 1, 2025 నుండి బ్యాంకులు ఈ ప్రచారాన్ని ప్రారంభించి, ఇప్పటివరకు దాదాపు ఒక లక్ష గ్రామ పంచాయతీల్లో ప్రచారాన్ని పూర్తి చేశాయని తెలిపారు. KYC ప్రక్రియను పూర్తి చేయడానికి జన్ ధన్ ఖాతాదారులందరూ ముందుకు రావాలని నిర్మలా సీతారామన్ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశానికి పోరాడే శక్తి ఉందని, ఇతర దేశాల ఒత్తిడికి తలొగ్గదని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన "సెల్యూటింగ్ అవర్ హీరోస్" అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశం ఏ దేశంపై   కావాలని దాడి చేయదని, ఆత్మరక్షణ కోసం మాత్రమే దాడి చేస్తుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ కొత్త చరిత్రను లిఖించిందని ఉద్ఘాటించారు. పెహల్గాం దాడికి ప్రతిస్పందనగా భారతసైన్యం ఆపరేషన్ మహదేవ్ చేపట్టి ఉగ్రవాదులను మట్టు పెట్టిందన్నారు. ఈ ఆపరేషన్లలో పాల్గొన్న త్రివిధ దళాలకు వెంకయ్య నాయుడు అభినందనలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో ఈ రోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, నలుగురు గాయపడ్డారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పృథ్వీనాథ్ ఆలయానికి 15 మంది భక్తులతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి రెహ్రా గ్రామంలోని సరయు నది వంతెన సమీప కాలువలో పడిపోయింది. కాలువ నుంచి 11 మృతదేహాలను వెలికితీసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నలుగురిని సురక్షితంగా బయటకు తీశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించారు. ఈ ప్రమాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రెండు లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ చొరవతో సాగుతున్న 'ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్' ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తపాల శాఖ సహకారంతో జరిగింది. క్రీడాకారులు, యువత, ఫిట్‌నెస్ ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ అనుకూలమైన, ఆరోగ్యకర జీవనశైలికి దోహదపడే సైక్లింగ్ ను వారాంతపు అలవాటుగా పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా... 2024 దక్షిణాసియా అండర్ 16 బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకున్న భారత క్రీడాకారులు అర్మాన్, అన్ష్ తోమర్, శేఖర్ రథీ, కృష్ణ సునేరియాలను సత్కరించారు. ఫిట్ ఇండియా ఉద్యమం యువతలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని ఈ సందర్భంగా క్రీడాకారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్ జూనియర్ ఐదు రోజుల భారతదేశ పర్యటన నిమిత్తం రేపు మధ్యాహ్నం న్యూఢిల్లీకి చేరుకుంటారు. ఆయనతో పాటు ఆ దేశ వ్యాపార ప్రతినిధులు, క్యాబినెట్ మంత్రులు, సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా రానుంది. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటి సారిగా అధ్యక్షుడు మార్కోస్ భారతదేశంలో పర్యటిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లడానికి స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. ఈ రోజు ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు సమీప గ్రామాలు, నగరాలు, రాష్ట్రంలో లేదా దేశంలో తయారైన వస్తువును మాత్రమే కొనాలని, దేశం కోసం జీవించడం గౌరవనీయమైనదని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని పలు చోట్ల  భారత సైన్యం, జమ్మూ & కాశ్మీర్ పోలీసులు, CRPF ప్రారంభించిన సంయుక్త ఆపరేషన్ శుక్రవారం నుండి కొనసాగుతోంది. జమ్మూ, దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాం జిల్లా అఖల్ దేవ్‌సర్ ప్రాంతంలో పలువురు ఉగ్రవాదులు ఉన్నారన్న  సమాచారంతో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. దట్టమైన అఖల్ అడవులలో గత రాత్రి అంతా కాల్పులు కొనసాగాయని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ముగ్గురు గుర్తు తెలియని ఉగ్రవాదులు మరణించగా, ఒక సైనికుడు కూడా గాయపడ్డాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ లో కడపటి వార్తలు అందే సరికి ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 67 పరుగులు చేయాల్సి ఉంది.  ఇంగ్లాండ్ బ్యాట్స్ మ్యాన్ హేరీబ్రూక్ 111 పరుగులు చేసి ఆవుట్ అవవ్వగా జోరూట్ 88 పరుగులతో క్రీజ్‌లో నాటౌట్‌గా ఉన్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో 6వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్ బిలాస్‌పూర్ జిల్లాలోని భరారిలో గత 24 గంటల్లో అత్యధికంగా 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని వెల్లడించింది. రాబోయే రెండు రోజుల్లో ఆ రాష్ట్రంలో కూడా భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుందని పేర్కొంది.  మరిన్ని వివరాలను వాతావరణ శాస్త్రవేత్త తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =